క్లుప్తంగా

వెండి మబ్బుల వెలుగులు



సాగర తీరంలో ఉదయం వేళలో ఆహ్లాదకర వాతావరణం

ఏయూ క్యాంపస్ : సాగర తీరం ప్రకృతి సంగమం. నిత్యం సరికొత్తగా దర్శనమిస్తూ మనసుకి ఆహ్లాదాన్ని పంచుతుంది. అటువంటి సుందర దృశ్యం సాగర తీరంలో కనిపించి కనువిందు చేసింది. ఉదయం వేళల్లో సరదాగా కాసేపు నడకకు వెళ్లే వారికి ఇటువంటి సుందర దృశ్యాలు నిత్యం కనిపిస్తాయి. ఆస్వాదించే మనసుండాలే కాని తీరంలో సముద్రం, ఆకాశం, చుట్టూ ఉండే పరిసరాలు ఎంతో సుందరంగా కనువిందు చేస్తుంటాయి. మబ్బులను చీల్చుకుంటూ బయటకు వస్తున్న భానుడి లేలేత కిరణాలు మబ్బుల మాటు నుంచి దోబూచులాడుతూ మనల్ని పలకరిస్తూ, వెచ్చగా తాకే క్షణాన్ని వర్ణించడం కంటే అనుభవ పూర్వకంగా తెలుసుకుంటేనే బాగుంటుంది.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : విశాలాక్షినగర్‌కు సంబంధించిన ఫీడర్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. విశాలాక్షినగర్ 33/11 సబ్ స్టేషన్ పరిధిలో చలపతినగర్ ఫీడర్‌లో చేపట్టనున్న పనుల కారణంగా విశాలాక్షినగర్, రెవెన్యూకాలనీ, చలపతినగర్, షిర్డీ సాయి వెటర్నరీ కాలనీ, సంజీవినగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, బీవీకే కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుబజార్ సందర్శన

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను జిల్లా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు తాతారావు, శోభ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బజార్‌లోని ప్రతీ స్టాల్‌కు వెళ్లి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు విలువైన సేవలు అందించాలని రైతులకు సూచించారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని అరికట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ విషయంలో రైతులు, వినియోగదారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీపీ రైతు బజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు కనకరాజు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలు పరిశీలించిన ఆర్టీసీ ఛైర్మన్



డిస్పెన్సరీలో పరిశీలిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌ను ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు సందర్శించారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన గురువారం ఉదయం ఎంవీపీ కాలనీ బస్ స్టేషన్‌ను సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. డిస్పెన్సరీ ద్వారా ఉద్యోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎంవీపీ ఆర్టీసీ డిస్పెన్సరీని విస్తరించడంతోపాటు ఆధునికీకరించాల్సిన అవసరముందన్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని అధికారులకు సూచించారు. దీంతోపాటు ఆగస్టు 15 నుంచి అమలు కానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విశాఖ నగరానికి రానున్న ఎలక్ట్రికల్ బస్సుల వినియోగం వంటి అంశాలపై చర్చించారు. ఎంవీపీ బస్ స్టేషన్‌ను మరింత శుభ్రంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కేఎస్‌బీ రెడ్డి, విశాఖ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, సీనియర్ మెడికల్ ఆఫీసర్స్ వాణి నీలిమం, ఆశాకిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ఎంవీపీ కాలనీ : లాసన్స్ బే కాలనీలోని హిడెన్‌స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో గురువారం పండ్లు, దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. లగుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు లగుడు అప్పడమ్మ 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతోపాటు వృద్ధులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ లగుడు గోవిందరావు, రమ్య, స్కూల్ కరస్పాండెంట్ కండిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎడాపెడా తవ్వేస్తున్నారు



ఎంవీపీ కాలనీ రైతు బజార్ సమీపంలో తవ్వకాల సమయంలో కూలిన ఫుట్‌పాత్‌ను నిర్మించకుండా కప్పేయడంతో రాకపోకలకు అధ్వానంగా మారిన రోడ్డు



పెదవాల్తేర్ ఆర్టీసీ డిపో కూడలి మేఘనా టవర్స్ ఎదుట తవ్వేసిన రోడ్డు



కేబుల్ లైన్ కోసం ఏయూ అవుట్ గేట్ సమీపంలో తవ్వి వదిలేసిన రోడ్డు

- జోన్ – 3 పరిధిలో ఇష్టారాజ్యంగా రోడ్ల తవ్వకాలు
- ఈపీడీసీఎల్, ప్రైవేట్ సంస్థల నిర్వాకంతో వాహనదారులకు అవస్థలు
- గుంతలు పూడ్చడంలో అడుగడుగునా అంతులేని నిర్లక్ష్యం
- నరకం చూస్తున్న వాహనదారులు, పట్టించుకోని అధికారులు

ఎంవీపీ కాలనీ : విద్యుత్ కేబుల్స్ నిర్మాణం, యూజీడీ పనుల కోసమని కొత్తగా నిర్మించిన రోడ్లను సైతం ఎడాపెడా తవ్వి పారేస్తున్నారు. ఇటు రోడ్లకు నష్టం కలిగించడంతోపాటు వాహనదారులకు రాకపోకలకు చుక్కలు చూపిస్తున్నారు. ప్రస్తుతం ఎంవీపీ కాలనీతోపాటు లాసన్స్ బే కాలనీ, బీచ్‌రోడ్డు, చినవాల్తేర్, పెదవాల్తేర్‌లలో జరుగుతున్న రోడ్ల తవ్వకాలే ఇందుకు నిదర్శనం. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న తవ్వకాలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఆయా విద్యుత్ కేబుల్స్, యూజీడీ లైన్స్ ఎవరు నిర్మిస్తున్నారు.., ఇది ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతుందా..?, లేదా ఏవైనా ప్రైవేట్ సంస్థలు నిర్మిస్తున్నాయా..? ఇక్కడ జరుగుతున్న పనులకు ఎవరు బాధ్యత వహిస్తున్నారనే దానిపై స్పష్టత లేకపోవడంతో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు తవ్వకాలు అనంతరం ఆయా గుంతలు పూడ్చడంలో జరుగుతున్న నిర్లక్ష్య ధోరణిపైనా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



గిరిజన్ భవన్ దరి ఎంవీపీ డబుల్ రోడ్డులో తవ్వేసిన రోడ్డు



టీటీడీ కూడలి దరి కల్వర్టు వద్ద తవ్విన గుంతను కప్పకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారిన దృశ్యం

తవ్వకాలతో అధ్వానంగా రోడ్లు

ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో గత నెల రోజులుగా ఎడా పెడా తవ్వకాలు జరుగుతున్నాయి. విద్యుత్ కేబుల్స్ నిర్మాణం కోసం ఫుట్‌పాత్‌ను ఆనుకుని ఇష్టారాజ్యంగా ఈ తవ్వకాలు చేస్తున్నారు. దీంతో అనేక చోట్ల లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన ఫుట్‌పాత్‌లతోపాటు రోడ్లు దెబ్బతింటున్నాయి. ఎంవీపీ రైతు బజార్ సమీపంలో ఈ తవ్వకాలు కారణంగా ఫుట్‌పాత్ కుప్పకూలగా ఇప్పటికీ ఆ గొయ్యిలను పూర్తి స్థాయిలో కప్పకపోవడంతో ఆ ప్రాంతమంతా అధ్వానంగా మారింది. దీంతోపాటు పెదవాల్తేర్ ఆర్టీసీ డిపో దరి మేఘన రాయల్ టవర్స్ ఎదురుగా యూజీడీ నిర్మాణం కోసం రోడ్డును ఎడాపెడా తవ్వేయడంతో దారుణంగా మారింది. దీంతో వాహనదారులు సైతం ఆ రోడ్లపై ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే గతేడాది కాలంలో ఇదే ప్రాంతంలో అనేక సార్లు తవ్వకాలు చేపట్టడం గమనార్హం. అయితే ఈ తవ్వకాలు జీవీఎంసీ చేపట్టిందా..? లేక ఆ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు చేపట్టారా..? అనేదానిపై స్పష్టత కొరవడింది. దీంతోపాటు పెదవాల్తేర్ ఆర్టీసీ డిపో నుంచి శివారెడ్డి బార్ కూడలికి వెళ్లే మార్గంలో డివైడర్‌ను ఆనుకుని కేబుల్స్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టడం, తవ్విన వ్యర్థాలు సకాలంలో తరలించకుండా వదిలేయడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. విశాఖ ఐ హాస్పిటల్ కూడలి నుంచి సిరిపురం వెళ్లే మార్గంలో, చినవాల్తేర్ మసీదు కూడలి నుంచి ఏయూ అవుట్ గేట్ మీదుగా సిరిపురం వెళ్లే మార్గంలో కేబుల్స్ నిర్మాణం కోసం ఎడాపెడా రోడ్లను తవ్వి వ్యర్థాలను ఎక్కడికక్కడే వదిలేయడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ విచ్చలవిడి తవ్వకాలపై జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టి, రోడ్లను సంరక్షించాలని వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చెత్త వేరుచేసి అందించాలి



విశాలాక్షినగర్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డులో జోన్ – 2 జెడ్సీ కనకమహాలక్ష్మి గురువారం పర్యటించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, సచివాలయం సిబ్బందితో కలిసి ఆమె విశాలాక్షినగర్‌లో స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సకాలంలో కుళాయిల ద్వారా నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, వీధుల్లో పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తనకు తెలియజేయాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లో తడి, పొడి చెత్త వేరు చేసి రోజూ వస్తున్న పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో నాయకులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులో మూడు బీటీ రోడ్ల నిర్మాణం కోసం గురువారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. రూ.55.38 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అవకతవకలకు పాల్పడకుండా నాణ్యతతో నిర్మాణలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు పాల్గొన్నారు.

నమ్మించి మోసగించడం చంద్రబాబు నైజం

- ఎన్నికల హామీలన్నీ గాలికొదిలేశారు
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న పల్లా దుర్గారావు తదితరులు



జీవీఎంసీ 23వ వార్డులో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం : ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి... అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని పక్కనపెట్టి, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం గద్దె దిగేవరకు మోసపోయిన ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పిలక మధుసూదన రెడ్డి, వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు కొయ్య శశికళ, సూర్యనారాయణ రెడ్డి, ఈశ్వరరెడ్డి, కొండపల్లి రమణ, పినింట్ల నర్సింగరావు, బోస రమణ రెడ్డి, బోయి రమణ రెడ్డి, త్రినాథ్ రెడ్డి, జగదీష్ రెడ్డి, బోర రామిరెడ్డి, బోస రమణ రెడ్డి, ఎల్లయ్య రెడ్డి, త్రినాథ్ రెడ్డి, నారాయణ రెడ్డి, కొనన రాము, సుధీర్ రెడ్డి, సూరిబాబు, ముదిలి శ్రీను, అరుణ, రమణమ్మ, దుర్గ, చిన్ని, మంగ, మణి, కుసుమ, భవానీ, రమణమ్మ, సుజాత పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు మరిచారు

ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం జీవీఎంసీ 10, 12, 13వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించారు. పార్టీ పదో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, కార్యకర్తలు కలిసి ఇందిరానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలు వివరించారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా కూటమి నాయకులు కాలం గడుపుతున్నారని వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకుడు గూడపాటి విక్టర్, పతివాడ వెంకటలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణ, సంపత్, రాహుల్, శశికుమార్, సురేష్, రవికుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

- 12వ వార్డు నెహ్రూనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలు, నెరవేర్చని ఎన్నికల హామీలు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొల్లి హేమంత్, లవనకుమార్, సీహెచ్.అర్జున్, సుజాత, వెంకటప్పారావు, కొల్లి అప్పారావు, మోహన్, సంజీవి, సంతోష్, శ్రీనివాస్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.
- 13వ వార్డు సిద్దార్థనగర్‌లో వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ స్థానిక నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకుడు శ్రీనివాసరావు, ప్రసంగి వాసు, బేత దుర్గారావు, సాగరిక, బేగం, జగదీష్, అప్పలనాయుడు, పోలారావు, పి.బంగార్రాజు, కాకర గోవింద్, బాబూరావు, పాండ్రంగి శ్రీను, రాము, నాయుడు పాల్గొన్నారు.



13వ వార్డు సిద్ధార్థనగర్‌లో కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇంటింటికీ కూటమి ప్రభుత్వం మోసాలు

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరిరచి చైతన్యం కల్పిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు తెలిపారు. జీవీఎంసీ 28వ వార్డు భానోజీ నగర్ పరిధిలోని బూత్ నంబర్ 195, 196లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరిచిన కరపత్రాలు అందజేశారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసం వివరించారు.

రోడ్డుపై ఇసుకతో ఇబ్బందులు



సుందరయ్యకాలనీ కోకా కోలా బిల్డింగ్ పక్కన రోడ్డుపై ఇసుక

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో రోడ్లపైనే గృహ నిర్మాణ సామగ్రి డంప్ చేస్తుండడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ప్రైవేట్ వ్యక్తులు గృహ నిర్మాణాలు, జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేసి రోజుల తరబడి వదిలేస్తున్నారు. అవి వాహనచోదకులు, పాదచారులకు ఆటంకంగా మారుతున్నాయి. ఈపీడీసీఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పనుల కోసం ఇసుక రోడ్లపై ఎక్కడపడితే అక్కడ దిబ్బలుగా వేసేస్తున్నారు. గృహ నిర్మాణాలు చేపట్టేవారు కూడా నిర్మాణం జరుగుతున్న చోట ఇసుక, పిక్క, ఇటుకలు దిబ్బలుగా వేసేస్తున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి సుందరయ్యకాలనీ కోకో కోలా బిల్డింగ్ పక్కన, అంబేడ్కర్‌నగర్ ఫుడ్‌విల్లా హోటల్ పక్కన గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా చోట్ల రోడ్లపైనే వేసిన ఇసుక, పిక్క దిబ్బలుతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కోకా కోలా బిల్డింగ్ పక్కన నిర్మాణదారుడు గోతులు తవ్వి కోలమ్స్ కోసం ఇసుక, పిక్క, తీసుకొచ్చి రోడ్డుపై వేశాడు. అ తర్వాత పనులు ఆపేయడంతో ఆ ఇసుకను కుక్కలు రోడ్డంతా జల్లేశాయి. అది సీసీ రోడ్డు కావడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇసుకలో జారి పడిపోతున్నారు. సుమారు రెండు వారాలుగా ఇక్కడ ఇదే సమస్య. నిర్మాణ పనుల కోసం తీసుకొచ్చిన సామగ్రి ఒకటి రెండు రోజుల్లో రోడ్డు మీద నుంచి ఖాళీ స్థలంలోకి తరలిస్తే ఈ సమస్య ఉండదు. లేదంటే వెంటనే నిర్మాణ పనులు జరిపించేయాలి. పనులు జరిపించకుండా రోడ్డుపైనే ఇసుక దిబ్బలు నిల్వ వుంచడంతో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు మధ్యలోనే వీడియోల చిత్రీకరణ



రోడ్డు మధ్యలో వీడియోలు చిత్రీకరిస్తున్న యువత

ఏయూ క్యాంపస్ : రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిపోవాలి. వేలాది మంది ఫాలోవర్లు వచ్చేయాలి. ఇదీ నేటి తరం యువత ఆలోచన. తమ భవిష్యత్, కెరీర్ కంటే వీటిపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. నలుగురైదుగురు యువతీ యువకులు కలిసి రీల్స్ చేయడం.. సోషల్ మీడియాలో వాటిని పోస్ట్ చేయడం నిత్యం పనిగా పెట్టుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా సమయం, అందమైన ప్రదేశాలను అన్వేషించే పనిలో మునిగిపోతున్నారు. దీనిలో భాగంగా బీచ్ రోడ్డులో ఇటువంటి వీడియో షూట్‌లు నిత్యం పదుల సంఖ్యలో జరుగుతున్నాయి. ఉడాపార్క్ ఉదురుగా డిఫెన్స్ ఆఫీసర్స్ ఫ్లాట్స్, జీసీసీ కార్యాలయం పక్క రోడ్డు, శారదా బేకరీ రోడ్డులో నిత్యం ఇటువంటి వీడియో షూట్‌లు చేసేవారు కనిపిస్తున్నారు. రోడ్డు మధ్యలో వారి వాహనాలు నిలిపేసి వీడియోలు తీయడం, రహదారి మధ్యలో నృత్యం చేస్తూ వీడియోలు చేయడం పరిపాటిగా మారిపోయింది. దీంతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వీడియోలు తీయొద్దని కొంత మంది బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అయినా వీరు అవి పట్టించుకోకుండా తమకు నచ్చిన విధంగా వీడియోలు తీస్తూ ఆ ప్రాంతంలో నివసించే వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఇటువంటి వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

శ్లాబు వదిలేసి.. ఇటుకలు తొలగించారు

- అక్రమ నిర్మాణాలపై తూతూమంత్రంగా టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

అనధికారిక నిర్మాణంలో భవనం శ్లాబు వదిలేసి ఇటుకలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది



తొలగించిన గోడ ఇటుకలు

ఆరిలోవ : జీవీఎంసీ 9, 10, 11, 12, 13వ వార్డుల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ప్లాన్ పొందిన దానికంటే అక్రమంగా అదనంగా శ్లాబులు వేసేస్తున్నారు. దీనిపై 'గ్రీన్ కవర్ ముసుగేసి అక్రమ నిర్మాణాలు' శీర్షికతో జూలై 27న సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. జీవీఎంసీ పదకొండో వార్డు బాలాజీనగర్ (పాత ఆరిలోవ)లో నిర్మించిన ఓ భవనంపై అక్రమ అంతస్తును తొలగించడానికి గురువారం జోన్ – 2 ఏసీపీ ఆదేశాలతో సిబ్బంది వెళ్లి తూతూ మంత్రపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. అనధికారికంగా నిర్మించిన శ్లాబును వదిలేసి పిట్ట గోడల కోసం వేసిన ఇటుకలను తొలగించి వదిలేశారు. ఇక్కడ గోడలు తొలగిస్తుండగా జోన్ – 2 కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఆ భవనం శ్లాబు తొలగించకుండా తిరిగి వచ్చేయమని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఏసీపీ ఆదేశాలు సైతం పక్కనబెట్టి కింది స్థాయి ఉద్యోగి పిలుపుతో సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, సిబ్బంది తొలగింపు ఆపేసి వెళ్లిపోవడం విశేషం. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

బాలుర వసతి గృహం పరిశీలన



బాలురతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు గురువారం డెయిరీఫారం వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల గృహం, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గృహాల్లో వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. వారికి అందిస్తున్న ఆహారం, పరిశుభ్రత, వైద్య సేవలపై ఆరా తీశారు. వసతి గృహాల తీరు, వాటి నిర్వహణపై నిర్వాహకులకు, బాలురకు పలు సూచనలు చేశారు. గృహాలలో తలెత్తిన లోపాలు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డెన్లకు సూచించారు.

430 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ నేత్ర వైద్య పరీక్షలు చేసి, వీరిలో 64 మందికి దృష్టిలోపం ఉన్నట్టు నిర్ధారించారు. 58 మందికి కళ్లద్దాలు అవసరమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంపిణీ చేస్తుందని తెలిపారు.